www.aakshitha.com

People's voice


# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

గురువారం | 02 | జూలై | 2026 | పేజీలు: 08



## పని వేళల్లో అలసత్వం వద్దు

**చదువుకుంటేనే భవిత**

**విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి**

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

మహబూబ్ నగర్, అక్షిత న్యూస్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల నమోదు, హాజరు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో మండల విద్యాధికారులు (ఎంఈఓలు), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ..మిగతా 2లో



## మిడ్జిల్ ప్రగతే లక్ష్యం

- ప్రజల రుణం తీర్చుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- 4న మిడ్జిల్‌కు సీఎం రాక

### 20 ఏళ్ల క్రితం జడ్పీటీసీగా నేడు ముఖ్యమంత్రిగా..


జడ్చర్ల నియోజకవర్గ శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, సుమారు 20 సంవత్సరాల క్రితం ఇదే జూలై నెలలో నేటి ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సామాన్య వ్యక్తిగా మిడ్జిల్ మండలం నుంచి జడ్పీటీసీ అభ్యర్థిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఆ రోజు నుంచి నేటి వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన తన రాజకీయ ప్రయాణంలో మిడ్జిల్ మండల ప్రజల ఆదరణ, ఆశీర్వాదాలు కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సందర్భాల్లో స్వయంగా పేర్కొన్నారని తెలిపారు.




**ఉమ్మడి మిడ్జిల్-ఉర్కొండకు భారీ నిధులు**

**మిడ్జిల్ అభివృద్ధికి జూలై 4 చారిత్రాత్మక రోజు**

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

జడ్చర్ల, అక్షిత న్యూస్ : జడ్చర్ల నియోజకవర్గ శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, సుమారు 20 సంవత్సరాల క్రితం ఇదే జూలై నెలలో నేటి ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సామాన్య వ్యక్తిగా మిడ్జిల్ మండలం నుంచి జడ్పీటీసీ అభ్యర్థిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఆ రోజు నుంచి నేటి వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన తన రాజకీయ ప్రయాణం లో మిడ్జిల్ మండల ప్రజల ఆదరణ, ఆశీర్వాదాలు కీలకమని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అనేక సందర్భాల్లో స్వయంగా పేర్కొన్నారని తెలిపారు. మిడ్జిల్ మండల ప్రజలపై ఉన్న కృతజ్ఞతాభావంతో, వారి రుణం తీర్చుకునే సంకల్పంతోనే జూలై 4వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడ్జిల్ ..మిగతా 2లో



## వేగంగా ఇందిర మహిళ శక్తి పెట్రోల్ పంపు పనులు

**పనుల పర్యవేక్షణ**

**కలెక్టర్ బి.చంద్రశేఖర్**





నల్గొండ, అక్షిత ప్రతినిధి: నల్గొండ ఎస్ఎల్ బిసి వద్ద నిర్మిస్తున్న "ఇందిర మహిళ శక్తి పెట్రోల్ పంపు "పనులను వారం రోజుల్లో పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం అయన ఇందిర మహిళ శక్తి పెట్రోల్ పంపు పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహిళా శక్తి పెట్రోల్ పంపులో పనిచేసే సిబ్బందికి ఇప్పటినుండే శిక్షణ ఇవ్వాలని, ఐఓసీఎల్ ద్వారా శిక్షణ ఇప్పించాలని ఎపిడి శ్రవణ్ ను ఆదేశించారు. అదేవిధంగా పెట్రోల్ పంపు వద్ద పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో సూపర్ మార్కెట్, రెస్టారెంట్ ఏర్పాటు చేస్తున్నందున రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన చేయించేందుకు ఏర్పాటు ..మిగతా 2లో



## ఇంటింటికి వెళ్లి పక్కగా గణన

**గడువులోగా ఓటరు గణన పూర్తి చేయాలి**

**నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ**

**జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ**

**ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశాలు**

ములుగు, అక్షిత ప్రతినిధి: భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఈ ప్రక్రియను ..మిగతా 2లో





## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**నాణ్యమైన భోజనాన్ని అందించాలి**

**కలెక్టర్ దీపక్ తివారీ**

వికారాబాద్, అక్షిత బ్యూరో: ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల తో పాటు వైద్య అధికారులు ప్రజలకు అందుబాటు లో ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. పరిగి మండలం చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తుంకులగడ్డలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మిక పర్యటనలో భాగంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఆసుపత్రిలో కావలసిన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో సౌకర్యాలపై ..మిగతా 2లో

## మిడ్జిల్ ప్రగతే లక్ష్యం



**మొదటి పేజీ తరువాయి...**

మండల కేంద్రానికి విచ్చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా ఉమ్మడి మిడ్జిల్--ఉర్కొండ మండలాల అభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు, పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సీఎం 20 సంవత్సరాల రాజకీయం పూర్తవుతున్న సందర్భంగా జూలై 4న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు.

## వేగంగా ఇందిర మహిళ శక్తి పెట్రోల్ పంపు పనులు

**మొదటి పేజీ తరువాయి...**

చేయాలన్నారు. పెట్రోల్ పంప్, సూపర్ మార్కెట్, రెస్టారెంట్ అన్నింటికీ పనికి వచ్చే విధంగా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని, ప్రస్తుతము ఈ స్థలంలో ఉన్న ఎలక్ట్రికల్ లైనింగ్ మొత్తాన్ని షిఫ్ట్ చేయాలని ఎలక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. పెట్రోల్ పంపు కలరింగ్, నేమ్ ప్లేట్ తో సహా ల్యాండ్ స్కేప్, సుందరీకరణ పనులన్నింటిని ఈనెల 7లేదా 8 లోపు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇందిర మహిళ శక్తి పెట్రోల్ పంపులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని నల్గొండ ఎస్ఎల్ బిసీలో నిర్మిస్తున్న పెట్రోల్ పంపు రాష్ట్రంలో ఉత్తమంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. పెట్రోల్ పంపులో ఎలాంటి ఆధారం లేని వారు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. డిఆర్డిఓ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రవణ్, విద్యుత్ ఏడిఈ వేణుగోపాల్,డివిజనల్ ఇంజినీర్ ప్రసాదరావు,ఏఈ యాసిన్ అలీ ఉన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి





**మొదటి పేజీ తరువాయి...**

ఆసుపత్రికి వచ్చిన రోగులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, ఇన్ పేషెంట్ వార్డు, స్త్రీల వార్డు గదులను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందర్శించిన క్రమంలో మెనూ ప్రకారం భోజనాన్ని సిద్ధం చేయలేదని గుర్తించిన కలెక్టర్ తప్పనిసరిగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు అందించినట్లయితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.అనంతరంతుంకులగడ్డ తెలంగాణ గురుకుల పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన సిద్ధంగా ఉన్న వంటకాలను కలెక్టర్ పరిశీలించారు.

పాఠశాలలో ఏవైనా మరమ్మత్తు పనులు ఉంటే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఆర్డీవో వాసు చంద్ర, డిఎంహెచ్ఓ పి.రాంబాబు, డిఎస్సిడబ్ల్యూఓ జయపాల్ రెడ్డి, తహసిల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ హరి ప్రియా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పని వేళల్లో అలసత్వం వద్దు

**మొదటి పేజీ తరువాయి...**



ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, నిర్దేశిత టైమ్‌టేబుల్ ప్రకారం తరగతి గదులకు సకాలంలో హాజరై నాణ్యమైన బోధన అందించాలని ఆదేశించారు. పాఠశాల పని వేళల్లో ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా తరగతి గదిలో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురుకుల పాఠశాలల్లో నైట్ డ్యూటీ పూర్తి చేసిన ఉపాధ్యాయుల స్థానంలో వెంటనే ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి బోధనకు అంతరాయం కలగకుండా చూడాలని ప్రత్యేక అధికారులను, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా 'బడిబాట' కార్యక్రమంలో విద్యార్థుల నమోదు లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని అన్ని ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

విద్యార్థుల అపార్ ఐడీ నమోదు, ఆధార్ సీడింగ్, మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ప్రతి విద్యార్థి ఆధార్ వివరాలు స్కూల్ ఎడ్యుకేషన్ పోర్టల్‌లో నవీకరించబడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసి 6వ తరగతిలో ప్రవేశం కోసం ఎదురుచూస్తున్న డ్రాప్‌బాక్స్ విద్యార్థులందరికీ వెంటనే ప్రవేశాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బంది ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరును సమీక్షించిన సందర్భంగా సీసీ కుంట,



కౌకుంట్ల, దేవరకద్ర మండలాల్లో హాజరు శాతం తక్కువగా ఉన్నట్లు గుర్తించి, సంబంధిత మండల విద్యాధికారులు తక్షణమే మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులు తీసుకునే ఎర్న్డ్ లీవ్ , మెడికల్ లీవ్‌లకు ముందస్తు లిఖితపూర్వక అనుమతి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేస్తూ, సంబంధిత ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయుల అనుమతి అనంతరమే సెలవులు వినియోగించుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం ఉపాధ్యాయుల హాజరు నివేదికను సిద్ధం చేసి సమీక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.

లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అమలును సమీక్షిస్తూ, గత విద్యా సంవత్సరపు అంచనా ఫలితాలను ఈ నెల 18వ తేదీన నిర్వహించే అంచనాతో పోల్చి విద్యార్థుల అభ్యాసంలో వచ్చిన పురోగతిని విశ్లేషించాలని సూచించారు.

గత మూడు నెలలుగా మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నిర్వహించిన పాఠశాలల తనిఖీలను సమీక్షించిన కలెక్టర్, ప్రతి ఎంఈఓ నెలకు కనీసం 16 పాఠశాలలను, ప్రతి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కనీసం 12 పాఠశాలలను సందర్శించి తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. లక్ష్యాలకు తగ్గట్టుగా పర్యటనలు చేయని అధికారులు తమ పనితీరును మెరుగుపర్చాలని సూచించారు.

ప్రీ-ప్రైమరీ తరగతుల నమోదును సమీక్షిస్తూ, నమోదు లేని పాఠశాలల్లో కనీసం 10 మంది విద్యార్థులను చేర్పించాలని సూచించారు. 15 మందికంటే తక్కువ నమోదు ఉన్న పాఠశాలలు, అలాగే గత మూడు సంవత్సరాలుగా తక్కువ నమోదు ఉన్న ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆదేశించారు.

కేజీబీవీ, పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న మరమ్మతులు, తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను అత్యంత ప్రాధాన్యంతో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గండీడ్, మహబూబ్‌నగర్ అర్బన్, భూత్పూర్, సీసీ కుంట కేజీబీవీలు, అలాగే పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ అడ్డాకల్, ఎంపీపీఎస్ జడ్చర్ల, జడ్పీహెచ్ఎస్ కోయిల్‌కొండ పాఠశాలల పనులను వచ్చే రెండు నుంచి మూడు వారాల్లో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనులపై ప్రత్యేక అధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ పురోగతి నివేదికలు పంపాలని, మండల విద్యాధికారులు నిరంతరం పర్యవేక్షించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

చివరగా పాఠశాలలకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందాయా అనే అంశాన్ని సమీక్షించిన కలెక్టర్, నిల్వ ఉంచకుండా వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ఎఎంఓ శ్రీనివాస్, సిఎంఓ సుధాకర్ రెడ్డి, జిఈసిఓ అస్రాఖాద్రీ, ప్లానింగ్ కోఆర్డినేటర్ ప్రశాంత్, అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ఎస్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి వెళ్లి పక్కాగా గణన

**మొదటి పేజీ తరువాయి...**

పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు.

బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.

**పారదర్శకతతో ప్రత్యేక సవరణ పూర్తి చేయాలి**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఎన్నికల సంఘం రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ప్రతి దశను అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. నిర్ణీత సమయపట్టిక మేరకు సవరణ ప్రక్రియను పూర్తి చేసి ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యమన్నారు.

**ఫారాల పంపిణీ బీఎల్‌వోల బాధ్యత మాత్రమే**

ఓటరు గణన ఫారాల పంపిణీని కేవలం బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) మాత్రమే ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తారని, రాజకీయ పార్టీలకు



చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు ఈ ప్రక్రియలో పాల్గొని ఫారాలు పంపిణీ చేయరాదని స్పష్టం చేశారు. బీఎల్‌వోలకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, ఫారాల స్వీకరణపై ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు.రాజకీయ పార్టీలతో నిరంతర సమన్వయం

రాజకీయ పార్టీల ప్రతినిధులు బీఎల్‌వోల పనితీరును పరిశీలించవచ్చని, ఎన్నికల ప్రక్రియపై పరస్పర విశ్వాసం పెంపొందించేందుకు ప్రతి బుధవారం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశాల్లో వచ్చిన సూచనలు, అభ్యంతరాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా**

జూన్ 15 నుంచి 24 వరకు సన్నాహక కార్యక్రమాలు, శిక్షణ పూర్తయ్యాయని, జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికీ ఓటరు గణన కొనసాగుతుందని తెలిపారు. ఇదే గడువులో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి, ఓటర్ల సౌలభ్యం దృష్ట్యా కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, అనంతరం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, సవరణల దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రక్రియ విజయవంతానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ సమావేశంలో ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్‌డీఓ కృష్ణవేణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కుషీల్ వంశీ, ఏఈఆర్ఓ తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల సిబ్బంది, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డీఎంహెచ్ఓ వ్యవహారంపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

**వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘాల డిమాండ్**

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేత**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి:** హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నెలకొన్న పరిస్థితులపై తక్షణమే స్పందించి, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో ఫోన్‌లో మాట్లాడి, హనుమకొండ జిల్లా డీఎంహెచ్ఓ వ్యవహారంపై తగిన విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీఎన్‌జీఓస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ నాయకత్వంలో జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. డీఎంహెచ్ఓ వ్యవహార శైలి కారణంగా వైద్య ఆరోగ్య శాఖలోని ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వారు ఎమ్మెల్యేకు వివరించారు. ఉద్యోగుల విన్నపాన్ని శ్రద్ధగా ఆలకించిన ఎమ్మెల్యే నాయిని సమస్య తీవ్రతను వెంటనే గుర్తించి ఉద్యోగులు వ్యక్తం చేసిన ఆందోళనలను మంత్రికి వివరించి, అంశాన్ని ప్రాధాన్యతతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు బస్వారాజు సారయ్య,టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్ మోహన్ రావు, ప్రభుత్వ వైద్యుల సంఘం,వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# భక్తుల సౌకర్యాల కోసం ఆలయాల్లో మౌలిక వసతులు

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జూలై 1:** భక్తుల సౌకర్యాల కోసం ఆలయాల్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం చర్లపల్లి ఇ.సి. నగర్‌లోని పంచాయతన సమేత శ్రీ విజయ గణపతి దేవాలయంలో నూతనంగా నిర్మించిన వంటశాల, భోజనశాల, వసతి గృహాల గృహప్రవేశ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి విచ్చేసే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్మాణాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వంటశాల, భోజనశాల, వసతి గృహాల ఏర్పాటుతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న దేవాలయ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రముఖులు, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జూలై 1:** కుషాయిగూడలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ ఉత్సవాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక సంప్రదాయాలను పరిరక్షిస్తూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో పవర్ లూమ్ కార్మికుల నిరసన

**అర్హులైన కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పవర్లూమ్ వస్త్ర పరిశ్రమ మరియు--అనుబంధ పరిశ్రమలలోని అన్ని విభాగాలలో పని చేస్తున్న కార్మికులకు చేనేత– జౌళి శాఖ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఈరోజు ఉదయం చేనేత జౌళి శాఖ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు గత కొన్ని సంవత్సరాల నుండి చేనేత జౌళి శాఖ గుర్తింపు కార్డులు ఇవ్వడం లేనందున ఈ మధ్య కాలంలో చాలా మంది కార్మికులు వస్త్ర పరిశ్రమలో పనిచేస్తున్న వారికి గుర్తింపు కార్డులు లేకపోవడంతో చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత పెన్షన్ దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. కావున అర్హులైన కార్మికులందరికీ చేనేత - జౌళి శాఖ గుర్తింపు కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటి నాయకులు మరియు పవర్లూమ్ కార్మికులు అనుబంధ రంగా కార్మికులు పాల్గొన్నారు

# వైద్యులు ప్రజల ప్రాణాలను కాపాడే దేవుళ్ళు

**డాక్టర్స్ డే సందర్భంగా మెడికల్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్...**





**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు నిరంతరం అంకితభావంతో పనిచేస్తూ మానవాళికి విశేష సేవలు అందిస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. వైద్య వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, వైద్యులు ప్రజల ప్రాణాలను కాపాడే దేవుళ్లతో సమానమని పేర్కొన్నారు.

బుధవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం చెల్పూర్ శివారులో ఉన్న మెడికల్ కాలేజీలో డాక్టర్స్ డే సందర్భంగా మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,సమాజానికి వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని అన్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు నిరంతరం అంకితభావంతో పనిచేస్తూ మానవాళికి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వైద్య వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, వైద్యులు ప్రజల ప్రాణాలను కాపాడే దేవుళ్లతో సమానమని పేర్కొన్నారు. భవిష్యత్తులో వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అనంతరం మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్ ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల అధ్యాపకులు,వైద్యులు,విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ
## అప్రమత్తంగా వ్యవహరించాలి

**భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అధికారులకు సూచించారు జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజలకు నాణ్యమైన, పారదర్శక పోలీసు సేవలు అందేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు..ఈ తనిఖీలలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు,సిఐ నరేష్ కుమార్, ఎస్సై పవన్ కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

## విబిజి రామ్‌జి పథకాన్ని రద్దు చేయాలి

**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కొనసాగించాలి**

**సీపీఎం ప్రజా సంఘాల నాయకులు**



**నారాయణ పేట,అక్షిత ప్రతినిధి:** సీపీఎం,సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, అఖిలభారత కమిటీ పిలుపులో భాగంగా మద్దూర్ మండల కేంద్రంలో విబిజి రాంజీ పథకాన్ని నిరసిస్తూ ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేసి అనంతరం ఎంపీడీవో సీనియర్ అసిస్టెంట్ గారికి మెమొరండం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంజిలయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మొహ్మద్ అలీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి బి జి రాంజీ పథకం ద్వారా గ్రామీణ కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మళ్లీ వలసలు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం భరించే నిధుల శాతం తగ్గడం కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా చెల్లించుకోలేక కూలీలకు పని దినాలు తగ్గడం అనివార్యంగా మారుతుందని అన్నారు.గత యూపీఏ ప్రభుత్వం అనేక ఉద్యమాల అనంతరం స్వాతంత్ర అనంతరం కూలీలకు ఒక మంచి చట్టం తీసుకురావడం అనేది జరిగింది. ఇట్టి ఉపాధి హామీ పథకం అమలు రావడం ఇష్టం లేని కార్పొరేట్ వర్గాలకు వత్తాసు పలికే ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధికి ఉరి వేసే ఉద్దేశంతో వి బి జి రాంజీ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు కూలీలకు నష్టం కలిగించే ఈ పథకాన్ని రద్దుచేసి పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హనుమంతు,డివైఎఫ్ఐ జిల్లా నాయకులు అరుణ్, భారత్,వెంకట్,సీఐటీయూ నాయకులు కేశవులు, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కలల సాకారం
# సర్కార్ లక్ష్యం

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**



**కరీంనగర్ అక్షిత న్యూస్:** నిరుపేద సొంతింటి కలలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం నగర పాలక సంస్థ 8వ డివిజన్ పరిధిలో అల్గునూరులో తాళ్లపల్లి లాస్య--రమేశ్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలపడంతోపాటు కొత్తింట్లో వారు సుఖసంతోషాలతో జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పక్కా ఇల్లు కోసం ఎదురుచూస్తున్న పేదల ఆశలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు. నిజమైన అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల మంజూరు చేపడుతున్నామని, పేదలు గౌరవ ప్రదమైన జీవితం గడపాలంటే సొంత ఇల్లు అత్యంత అవసరమని పేర్కొన్నారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు. రైతు భరోసా కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది లక్ష్మీనారాయణ రెడ్డి, గోపు మల్లారెడ్డి, కంది పెద్ద అశోక్ రెడ్డి, కంది చిన్న అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోనే అత్యాధునిక వైద్య సేవలు

**భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎం.ఆర్.ఐ పరికరాన్నిజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్సార్...**



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ లో సీటీ స్కాన్, వెంటిలేటర్ వంటి ఆధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేశామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు పూర్తిగా వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు.

బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.12 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎం.ఆర్.ఐ యంత్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ప్రారంభించారు.ఈ ఎం.ఆర్.ఐ యంత్రాన్ని మంగళవారం హైదరాబాద్‌లో గౌరవ ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించగా, నేడు జిల్లా ఆసుపత్రిలో అధికారికంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ,భూపాలపల్లి జిల్లా ప్రజలు ఇకపై ఎం.ఆర్.ఐ పరీక్షల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోనే అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలందరూ ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఆసుపత్రి సూపర్డెంట్ రాజేంద్రప్రసాద్, డి.ఎం.హెచ్.ఓ మధుసూదన్ , వైద్యశాఖ అధికారులు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ ,భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్ ,వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ , స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..

## చట్టాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

**కల్వకుర్తి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ముదిగొండ రాజు**




**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** చట్టాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ముదిగొండ రాజు అన్నారు. మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలంలోని రైతు వేదిక లో స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యం తో చేసిన ఉచిత న్యాయ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం. రాజు మాట్లాడుతూ చట్టాల పట్ల యువతీ, యువకులు, విద్యావంతులు అవగాహన కలిగి ఉండాలని, అలాగే భారత రాజ్యాంగాన్ని చదు వాలన్నారు. పిల్లలకు ఫోన్ ఎక్కువగా ఇవ్వడం ద్వారా వారు ఇబ్బందులకు గురగాడంతో పాటు కంటి సమస్యలుఉత్పన్నమవుతున్నాయని అన్నారు. అలాగే ప్రజలు సైబర్ నేరస్తుల బారినపడి మోసపోతున్నారని, అనధికార ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ మాట్లాడవద్దని సూచించారు. 18 సంవత్సరాల లోపు ఉన్న విద్యార్థిని, విద్యార్థులకు, పిల్లలకు ఉద్దేశపూర్వకంగా కొట్టిన, పలు రకాల ఇబ్బందులు కలిగించిన వారిపై ఫోక్సో కేసు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. పిల్లలను పనిలో పెట్టుకోవదని, వారిని పాఠశాలకు పంపించాలని సూచించారు. సివిల్ కేసులలో పోలీసులు తల దూర్చరాదని, అలా ఉంటే పోలీసులపై చర్యలు తప్పమన్నారు. రాజీమార్గమే - రాజమార్గమని మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ,కన్నవారికి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అలాగే సీనియర్ న్యాయవాది సి. కృష్ణయ్య మాట్లాడుతూ ఇద్దరి మధ్య భూ పంచాయతీలు ఉన్నట్లయితే సివిల్ కోర్టులలో దావా వేసుకోవచ్చు అని, అలాగే 100 రూపాయలు దాటి ఏదైనా స్థిరాస్తిని కొనుగోలు చేస్తే తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రాథమిక హక్కులు ,విధులు ఎంతో విలువైనవని వాటిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య న్యాయమూర్తి ఎం .రాజును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. మల్లేష్, వెల్దండ సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్సై యుగేందర్ రెడ్డి, సింగిల్ విండో మెంబర్ వెంకటయ్య గౌడ్, న్యాయవాదులు ఎముక జంగయ్య, శివకుమార్ బి.మల్లేష్ యాదవ్, కోర్టు సిబ్బంది కీర్తి, శ్రీశైలం గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# మహిళా సంఘ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి/ అక్షిత బ్యూరో:** మహిళా సంఘాల సభ్యులకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు.

బుధవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా వైద్య అధికారి మనోహర్, రాష్ట్రస్థాయి అధికారులు , సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 1,94,493 మంది స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు ఉన్నారని తెలిపారు. వారందరికీ దశలవారీగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మూడు నెలల వ్యవధిలో పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మహిళకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో రక్తంలో చక్కెర పరీక్ష, సీరం బిలిరుబిన్, సీరం క్రియాటినిన్, బ్లడ్ యూరియా, ఎస్‌జీపీటీ, ఎస్‌జీఓటీ, సీరం ఆల్కలైన్ ఫాస్ఫటేస్, సీరం టోటల్ ప్రోటీన్, సీరం ఆల్బుమిన్ వంటి 10 బయోకెమిస్ట్రీ పరీక్షలు,



థైరాయిడ్ పనితీరును అంచనా వేసే టీఎస్‌హెచ్ పరీక్షతో పాటు హీమోగ్లోబిన్, తెల్ల రక్తకణాల సంఖ్య, ప్లేట్‌లెట్ కౌంట్, ఎర్ర రక్తకణాల సంఖ్య తదితర 7 హీమటాలజీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనంగా రక్తగ్రూప్, ఎత్తు, బరువు, బాడీ మాస్ ఇండెక్స్, రక్తపోటు, వైకల్య నిర్ధారణ, శరీర ఉష్ణోగ్రత, గుండె స్పందన రేటు, శ్వాస రేటు, కంటి పరీక్ష, నోటి పరీక్ష, చర్మం మరియు గోళ్ల పరీక్షలు వంటి 12 స్పోక్ స్థాయి ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల ద్వారా మహిళల్లో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లాలో అందుబాటులో ఉన్న ల్యాబ్ మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, మానవ వనరులు, రీ-ఏజెంట్లు మరియు ఇతర అవసరమైన సామగ్రిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అవసరమైన చోట ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

మహిళా సంఘాల సభ్యుల ఆరోగ్య పరీక్షలు, నమూనాల సేకరణ, డేటా నమోదు, ఫాలోఅప్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు మేప్మా, మున్సిపల్ శాఖ మరియు డీఆర్‌డీఏ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పోచంపల్లి, షరాజీపేట్ మరియు బీబీనగర్ ను మాస్టర్ ట్రైనర్ కేంద్రాలుగా గుర్తించి, అక్కడ శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్ల ద్వారా మిగిలిన ఆరోగ్య సిబ్బందికి శిక్షణ అందించి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య స్థితిపై సమగ్ర ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించడంతో పాటు, వ్యాధులను ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, డీసీహెచ్‌ఎస్, ఆర్‌ఎంఓలు, వైద్యులు, టీ-హబ్ ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సిపిఐ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తత

### సిపిఐ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

### భగత్ సింగ్ కాలనీ వాసులకు ఇంటి నెంబర్లు, పట్టాలు వెంటనే ఇవ్వాలి

### సోతుకు ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు






**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** భూపాలపల్లి పట్టణంలోని సర్వే నంబర్--280లో గత నాలుగు సంవత్సరాలుగా నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న భగత్ సింగ్ కాలనీ నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం దారుణమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు..సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భగత్ సింగ్ కాలనీ వాసులతో కలిసి సీపీఐ నాయకులు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంను చేపట్టారు..

నివాస హక్కు కోసం ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, వినతిపత్రాలు సమర్పించినా, ఆందోళనలు నిర్వహించినా పాలకులు స్పందించక పోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇంటి పట్టాలు, ఇంటి నెంబర్లు ఇవ్వకుండా వందలాది మంది నిరుపేదలకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు.

**వెంటనే పట్టాలు ఇవ్వాలి**

భగత్ సింగ్ కాలనీ ప్రజలకు వెంటనే ఇంటి పట్టాలు, ఇంటి నెంబర్లు మంజూరు చేయడంతో పాటు మంచినీటి సౌకర్యం, విద్యుత్, సైడ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ తక్షణమే స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు..ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే జీఎస్సార్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు..

**కలెక్టర్ కార్యాలయ ముట్టడిలో ఉద్రిక్తత**

సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న వారిపై అరెస్టులు చేయడం సమస్యలకు పరిష్కారం కాదని, భగత్ సింగ్ కాలనీ ప్రజలకు న్యాయం జరిగే వరకు సిపిఐ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని సోతుకు ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజు సతీష్, నూకల చంద్రమౌళి,వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసఫ్, ఎండి యాకుబ్ పాషా,గోలి లావణ్య, గోనెల తిరుపతి, పీక రవికాంత్, ఉల్లెరావు బన్నీ, రమ్య చారి, పల్లెల రజిత, గంప శ్రావణి, ఇటుకల శ్రీలత, పెద్దమాముల సంధ్య, గడ్డం స్వరూప పోతుగంటి స్వప్న, వాసం రజిత, పాండవుల రాజేశ్వరి, కట్టెకోళ్ల భారతి సంపత్, కంకల గట్టయ్య, బట్టు శ్రీనివాస్, వంగరి రాంబాబు, యాతం మల్లేష్, దుర్గయ్య రాజు తదితరులు, భగత్ సింగ్ కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

## ఉప్పల్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి : రజిత పరమేశ్వర్ రెడ్డి

### రూ.1.26 కోట్లతో భరత్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జూలై 1:** ఉప్పల్ డివిజన్‌ను అన్ని మౌలిక వసతులతో కూడిన ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని భరత్ నగర్ బురుజు గల్లిలో రూ. 1.26 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను రజిత పరమేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులు జరిగేలా ప్రతి పనిని స్వయంగా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఆమె అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి కాలనీలో మెరుగైన వసతులు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుడుగు నవీన్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, మేకల రామ్ రెడ్డి, జిత్తు, మేకల మధుసూదన్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, రాఘవేంద్ర, హనుమంత్, గుండాల అనిల్ రెడ్డి, మునుగొండ జగన్, సోమ్ బాలమణి, నక్క పార్వతమ్మ, బబ్బురావు, మోత్కూరి శ్రీహిత్ బాబీ, కొత్త వంశీ, గొండి ప్రశాంత్ రెడ్డి, దీపక్ గౌడ్, నవీన్ గౌడ్, కార్తీక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్త జనులు సుఖసంతోషాలతో జీవించాలి

### ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్





**కాజీపేట, అక్షిత ప్రతినిధి :** హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి బుధవారం రోజున వినాయ భాస్కర్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి వారికి సతీసమేతంగా పూజలు నిర్వహించారు. ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో ఆనందకరమని అన్నారు. దైనందిన జీవితంలో భక్తి, మత విశ్వాసాలు మనిషి ఎదుగుదలకు దోహదపడుతాయని తెలిపారు. ఎక్సైజ్ కాలనీలో ఎన్నో ఏళ్లుగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారని, కమిటీ సభ్యులను ఈ సందర్భంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినయ్ భాస్కర్ దంపతులను కమిటీ సభ్యులు శాలువా తో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో వినయ్ భాస్కర్ సతీమణి రేవతి భాస్కర్, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** ఇటీవల జరిగిన వరంగల్ క్లబ్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కమిటీ సభ్యులు బుధవారం ఉదయం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వరంగల్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ పి. ప్రవీణ్, జాయింట్ సెక్రటరీ బి. కన్నా రెడ్డి, ట్రెజరర్ పి. సుధీర్ కుమార్, అలాగే ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు గట్టు రాజు, చంద్రప్రకాశ్ రెడ్డి, కళ్యాణ్ రెడ్డి, సునీల్ రెడ్డి, పల్లం రవి, శ్రీధర్ రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, అజ్మీర రాజేష్, గోనె చెన్నారెడ్డి తదితరులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. వరంగల్ క్లబ్ మరింత అభివృద్ధి చెందుతూ సామాజిక, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, క్లబ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

## రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సు



**కరీంనగర్ అక్షిత న్యూస్:** కరీంనగర్ రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణ , ప్రజల బాధ్యత' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్నిఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు కంపక్స్ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లతో పాటు చాక్లెట్లను పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ కంటి పరీక్షలను నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులకు బట్ట బ్యాగులను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడాలనే సంకల్పంతో పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదేవిధంగా, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికులకు చీరలను అందజేసి, వారి పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మ్యాడం శివకాంత్, సెక్రటరీ బట్టు వినోద్, ట్రెజరర్ మెతుకు కృష్ణ చైతన్య, లయన్ లంబు సుధాకర్ రెడ్డి, బీజేపీ నాయకులు వంగల రవి గోపాల్, అప్పాల శ్రీనివాస్, మల్లేశం, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

### డీఎస్పీ నల్లపు లింగయ్య

### 180 ఇళ్లలో తనిఖీలు పత్రాలు లేని 55 వాహనాలు సీజ్

### కొత్త వ్యక్తుల కదలికలు, సైబర్ నేరాలు,రోడ్డు భద్రత, సీసీ కెమెరాలు,దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన



**నారాయణపేట,అక్షిత ప్రతినిధి:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం,నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడం లక్ష్యంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని భీమండి కాలనీలో బుధవారం ఉదయం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం (కార్డెన్ అండ్ సెర్చ్) నిర్వహించినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు.

ఈ సందర్భంగా మొత్తం 75 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని కాలనీలోని 180 ఇళ్లలో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 51 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 2 కార్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

అదేవిధంగా కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని వివరించారు. కొత్త వ్యక్తులు కాలనీలో నివాసం ఉంటే వారి వివరాలను స్థానిక పోలీసులకు తెలియజేయాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే డయల్--100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రజల భద్రత కోసం ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండే విధానాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ... జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం కోసం కమ్యూనిటీ కాంటాక్ట్



ప్రోగ్రాములను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు పోలీసులతో సమన్వయంతో పనిచేస్తే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. కాలనీల్లో అద్దెకు వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలను గృహ యజమానులు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. అనుమానాస్పద కదలికలు, నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఫోన్ కాల్స్, లింకులు,ఓటీపీలు,బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయవద్దని ప్రజలకు సూచించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించి వాహనాల సంబంధిత పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీఐ శివ శంకర్, ఎస్ఐ లు ఏ వెంకటేశ్వర్లు,సతీష్ రెడ్డి, నరేష్,కృష్ణ చైతన్య, గాయత్రి,పోలీసు సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా డాక్టర్స్ డే ఉత్సవాలు

### డాక్టర్స్ అయిన పూర్వ విద్యార్థులకు అపూర్వ సత్కారం

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ప్రతి ఒక్కరికి సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఉంటుందని మరియు ఏర్పరచుకున్నటువంటి లక్ష్యాలను ఎటువంటి ఇబ్బంది లేకుండా సాధించాలనే కోరిక ఉంటుందని. ఈ కోరికలను ఎటువంటి ఆటంకం లేకుండా డాక్టర్లు నెరవేరుస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వివిఎన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి బి.సి.రాయ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. వారి జయంతోత్సవం ఒక గొప్ప పండుగ అని మరియు దేశవ్యాప్తంగా చాలా ఘనంగా నిర్వహిస్తారని వారు చెప్పారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం వారి స్మారకార్థమై అనేక కార్యక్రమాలను నిర్వహిస్తారని ఈ






సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వారు చెప్పారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో వైద్యుల పాత్ర చాలా కీలకమైనదని మరియు వెలకట్టలేనిదని వారు తెలుపుతూ వైద్యుల వలన సమాజంలో అభివృద్ధి చోటు చేసుకుంటుందని ప్రధానంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి వారు చేసేటువంటి కృషి అద్భుతమైన ఫలితాలు ఇవ్వడమే కాకుండా ఇతరులకు ఆదర్శంగా ఉంటుందని వారు చెప్పారు. నేడు ప్రతి ఒక్కరు కోరిక ఆనందంగా ఉండడానికి డాక్టర్ని సంప్రదిస్తారని మరియు డాక్టర్లు చెప్పినటువంటి విషయాలను చూసి తప్పకుండా పాటిస్తారని వారు చెప్పారు. నేటి సమాజంలో అభివృద్ధికి ప్రధానంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.డాక్టలందరూ వివిధ సమయాలలో అద్భుతమైన సేవలను అందిస్తారని మరియు అందించే సేవల ద్వారా గుర్తింపు పొందుతారని మరియు ఇతరుల కోసం స్ఫూర్తిదాయకంగా ఉంటుందని వారు చెప్పారు. నేటి సమాజంలో డాక్టర్లు అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించడమే కాకుండా విలువలకు కట్టుబడి ఉన్నారని వారు చెప్పారు డాక్టర్ చేసిన త్యాగం ఎవరు చేయలేరని, అందుకే వారిని ప్రాణ రక్షకులుగా ఫ్రంట్ వారియర్స్ గా గుర్తించారని కొనియాడారు.

అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు వివిధ మెడికల్ కళాశాలల్లో దిగ్విజయంగా మెడిసిన్ పూర్తి చేసుకున్న సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు మరియు భవిష్యత్తులో మరిన్ని విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు

డాక్టర్స్ మరీయ్ చార్టెడ్ అకౌంటెంట్ల విశిష్టతను తెలియజేయడానికి పలు నాటికలను ప్రదర్శించారు

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



# కాంగ్రెస్‌లో ఫ్లెక్సీ తెచ్చిన లొల్లి...!

**కాటా వర్సెస్ శాపురం**

**కాంగ్రెస్‌లో చల్లారని ఫ్లెక్సీ చిచ్చు**

**గుప్పుమంటున్న గ్రూపు రాజకీయాలు**

**సీరియస్ తీసుకున్న పార్టీ అధిష్టానం?**



**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:** పటాన్‌చెరులో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అదే పార్టీకి చెందిన వారు చింపిన వ్యవహారం కాంగ్రెస్ నేతల మధ్య చిచ్చు పెట్టింది. ఈ వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకున్న నేతలు.. ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు. రామచంద్రపురం లోని బాలాజీ కన్వెన్షన్ హాల్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ "సర్" పై 'బి ఎల్ ఏ' లకు అవగాహన.. శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, బడా నేతలు విచ్చేస్తున్నందున వారి స్వాగతం కోసం స్థానిక కాంగ్రెస్ నేత శాపురం నరసింహారెడ్డి బాలాజీ కన్వెన్షన్ ముఖ ద్వారంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. వాటిని కాంగ్రెస్ పార్టీ సొంత నాయకులే చింపేశారు. ఈ చర్యకు సొంత పార్టీ వారే పాల్పడ్డారంటూ ఒక వర్గం నాయకులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. దీంతో తీవ్ర నిరుత్సాహానికి గురైన నేతలకు ఫ్లెక్సీలు, కటౌట్లు చింపడం మరింత మనస్థాపానికి గురిచేసింది. దీంతో ఈ వ్యహారాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకు పోవడానికి ఆ వర్గం నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.




**వదలమంటున్న నేతలు**

ఫ్లెక్సీల వ్యవహారంతో గ్రూపు రాజకీయాలు ఒక్కసారిగా బయట పడ్డాయి. ఈ విషయమై అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకుంటుందా? ఫ్లెక్సీల ఏర్పాటులో ప్రొటోకాల్ పాటించ లేదంటూ స్వయాన నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ బహిరంగంగా ఆరోపణ చేయటంతో పాటు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. నేతల మధ్య సమన్వయం, సఖ్యత లేని కొరణంగా ఇలాంటి పరిస్థితులు తలేత్తుతున్నాయని కొందరు నేతలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో గ్రూపు రాజకీయలను ప్రొత్సహిస్తున్న నేతల కారణంగా ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. కుల రాజకీయాలతో కొందరు చిచ్చు పెడుతుండగా.. ఆధిపత్యం కోసం మరి కొందరు పార్టీలో గ్రూపు రాజకీయాలను ప్రోత్స హిస్తున్నారంటూ కొందరు కాంగ్రెస్ నేతలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కాగా ఇక్కడ వార్డు నేతకూడా సీఎం రేవంత్ రెడ్డి పేరు చెప్పుకుని పెత్తనం చెలాయిస్తున్నందున ఈ పరిస్థితి దాపురించిందని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

**అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం.. శాపురం నరసింహా రెడ్డి**

40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి ఒక సామాజిక కార్యకర్తగా సేవలు అందిస్తున్న.. ఓర్వలేక నా ఫ్లెక్సీ చింపారు. నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ముందు ఉండి మరి ఫ్లెక్సీ చింపించారు. రాజకీయంగా నన్ను ఎదుర్కోవాలి కానీ.. ఫ్లెక్సీలు చింపే సంప్రదాయం మానుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాల మేరకే పని చేస్తూ ముందుకు సాగుతున్నామని.. వ్యక్తిగత నిర్ణయాలు, పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్నామని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలే నేటి డిజిటల్ విద్యకు ఆదర్శం

**మాలేగావ్ జడ్పీ ఉన్నత పాఠశాలలో**

**డిజిటల్ తరగతుల పరిశీలన చేసిన**

**సర్పంచ్ లక్ష్మణ్ భాయ్ ఆనంద్ షిల్కే**

**విద్యా ప్రమాణాలు,**

**మౌలిక వసతులపై ప్రశంసలు**




**నిర్మల్ అక్షిత బ్యూరో, జూలై 1:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు చేపడుతున్న సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఆధునిక డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫామ్‌లు వంటి సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు ఉత్తమ విద్యా కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

నిర్మల్ జిల్లా మాలేగావ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. పాఠశాలలో ఉపాధ్యాయులు డిజిటల్ బోర్డుల ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ఆధునిక విద్యను అందిస్తున్నారు.

గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ భాయ్ ఆనంద్ షిల్కే పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, ప్రధానోపాధ్యాయుడు షకీల్ అహ్మద్ ఖాన్ తో కలిసి డిజిటల్ తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి తరగతి గదిలో కూర్చొని బోధన విధానాన్ని పరిశీలించి, ఉపాధ్యాయుల పనితీరును అభినందించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు, సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రయోగాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మాలేగావ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గత కొన్నేళ్లుగా పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ మండల, జిల్లా స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించిందన్నారు. ప్రతి ఏడాది విద్యార్థులు మంచి మార్కులు సాధించడం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని ప్రశంసించారు.

అలాగే పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈజీఎస్ నిధుల ద్వారా రూ.33 లక్షల వ్యయంతో పాఠశాలకు కొత్త ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టామని, పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రహరీ గోడ పూర్తయితే విద్యార్థుల భద్రతతో పాటు పాఠశాల ఆవరణ మరింత సుందరంగా, రక్షితంగా మారుతుందని పేర్కొన్నారు.



వర్షాకాలంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాల యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు శానిటైజేషన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని తెలిపారు. అవసరమైతే గ్రామపంచాయతీ ద్వారా అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కలుపు నివారణ స్ప్రే చేయించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. శ్రీనివాస్, ధర్మరాజు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి ట్రస్ట్ బోర్డుపై రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి..




**యాదాద్రి అక్షిత బ్యూరో:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు నియామకాలపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓ టీవీ ఛానల్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ట్రస్ట్ బోర్డు నియామకాల విషయంలో తమలాంటి సీనియర్ నాయకులకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మాజీ భువనగిరి ఎంపీని, మునుగోడు నియోజకవర్గం యాదాద్రి జిల్లాలోనే ఉన్నప్పటికీ నియామకాలపై సమాచారం ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. ముందుగా తెలియజేసి ఉంటే తమ నియోజకవర్గం నుంచి ఒక సభ్యుడి పేరును ప్రతిపాదించే అవకాశముండేదని చెప్పారు. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలతో ముందుకు సాగడం కష్టమని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఒరిజినల్ నాయకులకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడిన సీనియర్ కాంగ్రెస్ నేతలను పక్కనబెట్టి, కొత్తగా పార్టీలో చేరిన వారికే ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. నియామకాల విషయంలో సీనియర్ నాయకుల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి వ్యవహారశైలిపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయాలని, కేవలం హంగామాలు, షోలకు పరిమితం కాకూడదని సూచించారు. సీఎం పని తీరుపై అసంతృప్తి కారణంగానే ఇటీవల నల్లగొండలో జరిగిన ముఖ్యమంత్రి సమావేశానికి తాను హాజరుకాలేదని వెల్లడించారు. తన సోదరుడు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తనను "దానకర్ణుడు"గా పేర్కొన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఆ మాటలను ఆయన సానుకూల ఉద్దేశంతోనే చెప్పారని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. యాదాద్రి ట్రస్ట్ బోర్డు నియామకాల అంశంపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలపై మరోసారి చర్చకు దారితీశాయి.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**ఎస్పీ డాక్టర్ వినీత్**

**ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు,బహిరంగ కార్యక్రమాలు,సభలు జిల్లాలో నిషేధం**



**నారాయణ పేట,అక్షిత ప్రతినిధి:** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా లిఈ నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌లి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... 30 పోలీస్ ఆక్ట్ జులై 31వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## నూతన రేషన్ షాప్ ను ప్రారంభించిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జూలై 1:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, బోడుప్పల్ డివిజన్‌లోని ఈస్ట్ బాలాజీహిల్స్ కాలనీలో నూతన రేషన్ షాపును బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, స్థానిక మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్, బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కొత్త కిషోర్ గౌడ్‌తో కలిసి రేషన్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన ప్రజా పంపిణీ వ్యవస్థను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రతి అర్హత గల కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ మాట్లాడుతూ ఈస్ట్ బాలాజీహిల్స్ కాలనీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రేషన్ షాపు ఏర్పాటు కావడం ఆనందదాయకమన్నారు. ఈ కలను సాకారం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఈ రేషన్ షాపు ద్వారా ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక సీనియర్ నాయకులు, అధికారులు, రేషన్ షాప్ యాజమాన్యం, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మీటర్ రీడింగ్ సులభతరం చేసిన విద్యుత్ శాఖ డిస్కమ్‌లు



**నారాయణపేట,అక్షిత ప్రతినిధి:** తెలంగాణ సదరన్ విద్యుత్ సంస్థ మీటర్ రీడింగ్ ను సులభతరం చేస్తూ....కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ నూతన విధానం పై మీటర్ రీడర్స్ కు అవగాహన కల్పించేందుకు బుధవారం నారాయణపేట డిఈటి.రాజు నాయక్,ఏఈ.మహేష్ గౌడ్ లు క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్ళారు.మొదటగా డాటా డౌన్లోడ్ చేసిన తరువాత కొత్త ఆప్షన్ లో ఈ.ఆర్.ఓ.కోడ్ ఎంట్రి చేయాలన్నారు. అనంతరం సెక్షన్ కోడ్ , స్ట్రక్చర్ కోడ్,డి.టి.ఆర్.కోడ్ , ఈవిధంగా ఎంట్రీ చేసినట్లయితే ఫీడర్ మ్యాపింగ్, స్ట్రక్చర్ మ్యాపింగ్ అయిన తరువాత ఈ కొత్త యాప్ లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వటం ద్వారా వినియోగదారుల నూతన ఫోన్ నెంబర్ ను ఎంట్రీచేసే అవకాశం ఉంది. ఈ విధానంలో బిల్లుల పెండింగ్ బాకాయిలు వినియోగ దారుని ఫోన్ ద్వారా బిల్లులు త్వరగా వసూలు చేసేందుకు అవకాశం ఉందని డిఈటి రాజు నాయాక్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అవగాహన సదస్సు స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో స్పాట్ బిల్లర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈ మహేష్ గౌడ్,స్పాట్ బిల్లర్లు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన విద్యా వాలంటీర్ల స్క్రీనింగ్ టెస్ట్

**మహబూబ్ నగర్ ,అక్షిత న్యూస్:** ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తన సొంత నిధులతో విద్యా వాలంటీర్లను నియమించేందుకు నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్ స్థానిక మహబూబ్ నగర్ ఫస్ట్ కార్యాలయంలో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే చేస్తున్న కృషి అభినందనీయం అని అన్నారు. ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, విద్యార్థులకు ఎలా చదవాలో మార్గనిర్దేశం చేయడానికి విద్యా వాలంటీర్లను నియమించడం గొప్ప ముందడుగు అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్ నగర్‌ను అన్ని రంగాల్లో ముందంజలో నిలపాలనే ఎమ్మెల్యే సంకల్పం ప్రత్యేకమని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే తన సొంత నిధులతో విద్యా వాలంటీర్ల నియామకాన్ని చేపట్టడం విద్యా రంగానికి ఎంతో





ఉపయోగకరమని మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకుడు గుండా మనోహర్ అన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని 100 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వాలంటీర్ల నియామకానికి సంబంధించి నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్ మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణా కేంద్రంలో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని తెలిపారు. ఈ పరీక్షకు నియోజకవర్గం నలుమూలల నుంచి నిరుద్యోగ యువత ఉత్సాహంగా హాజరై, మొత్తం 430 మంది పరీక్ష రాసినట్లు వెల్లడించారు.

గత విద్యాసంవత్సరంలో నియోజకవర్గంలోని 33 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించిన ఎమ్మెల్యే , ఆ కార్యక్రమం ద్వారా గణనీయమైన ఫలితాలు సాధించడంతో ఈ విద్యాసంవత్సరం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో వాలంటీర్లను నియమించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం విద్యా వ్యవస్థ బలోపేతానికి దోహదం చేయడంతో పాటు, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సమానమైన విద్యావకాశాలు కల్పించడంలో కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో మహబూబ్ నగర్ ఫస్ట్ మరియు వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షా ప్రక్రియను పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించడంపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషించనుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, మహబూబ్ నగర్ ఫస్ట్ ఇన్‌చార్జ్ నిజలింగప్ప , శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఒమేగా డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జూలై 1:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఒమేగా డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల కోసం మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) జలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ జలేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ, డ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, చెడు స్నేహాలకు దూరంగా ఉండి మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. “యూత్ ఫర్ ది నేషన్, నాట్ ఫర్ ఇంటొక్సికేషన్” అనే సందేశాన్ని విద్యార్థులకు అందిస్తూ, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సైబర్ నేరాలపై మాట్లాడుతూ గుర్తు తెలియని ఫోన్ కాల్స్, ఫేక్ లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, సోషల్ మీడియా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. రోడ్డు భద్రతపై మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అధిక వేగం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణ, ఎస్ఐ రవి, ఒమేగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థినులు తమ సందేహాలను పోలీసు అధికారులను అడిగి నివృత్తి చేసుకోగా, అధికారులు వారికి పలు సూచనలు అందించారు.

## విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి

### ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి



**నారాయణ పేట,అక్షిత ప్రతినిధి:** మాగనూరు మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీసు ముందు వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం ఎంపీడిఓ శ్రీనివాసులుగారికి మెమోరాండం ఇవ్వడం జరిగింది.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పుంజనూర్ ఆంజనేయులు సిఐటియు జిల్లా నాయకులు భరత్ కుమార్ మాట్లాడుతూ జులై 1 నుండి విబిజి రాం జి చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పోరాడి వామపక్షాలు మద్దతుతో సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసింది . వి బీ జి రామ్ జి చట్టాన్ని తెచ్చింది.125 రోజులు పని దినాలను ప్రచారం చేస్తున్నారు కానీ నిధులు కేటాయింపు బాధ్యతనుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకున్నది. గతంలో 90 శాతం నిధులు కేంద్రం ఇచ్చేది దానిలో 40% కోత పెట్టి 60 శాతం మాత్రమే ఇస్తారట.40% నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్తున్నారు. వ్యవసాయ పనుల సీజన్ లో 60 రోజులు పని బంద్ చేయాలని కొత్త చట్టంలో ఉన్నది.కనీస వేతనాలు గురించి కొత్త చట్టంలో పేర్కొనలేదు.ఉదయం సాయంత్రం పని ప్రదేశంలో ఫోటోలు అప్లోడ్ చేయాలి ఫోటోలు అప్లోడ్ అయితేనే వేతనాలు వస్తాయి లేకపోతే రావు.పని గ్రామపంచాయతీ ఎంపిక చేసే అవకాశం దీనిలో లేదు.కేంద్ర ప్రభుత్వమే ఎప్పుడు ఎవరికి ఎక్కడ పని పెట్టాలి అనేది నిర్ణయిస్తారు. సీనియర్ మేట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు కొత్త చట్టం అమలు అయితే కొనసాగే అవకాశం ఉండదు వారి ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందన్నారు.కూలీల పని హక్కును హరించే కొత్త చట్టాన్ని మన గ్రామంలో లేదా మండలంలో అమలు చేయకూడదని విజ్ఞప్తి చేస్తున్నాశీ. కార్మికులందరికీ నష్టం కలిగించే లేబర్ కోడ్స్ అమలు చేయకూడదు. విద్యుత్ సవరణ చట్టం రద్దు చేయాలి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మంగలి అశోక్, ఎంపీఆర్డీ మండల అధ్యక్షులు పుంజనూరు బాబు,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కే నరసింహా, రాఘువేంద్ర ఎస్ఎఫ్ఐ నాయకులు నయీమ్ ఉపాధి హామీ నాయకులు కే విష్ణు, కూలీలు ఒంటెలి వెంకటయ్య ,బులిమిని తిప్పయ్య ,నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.